

## నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: చినవెంకన్న నిత్యాన్నదాన ట్రస్టుకు బి.పద్మరాజు, లక్ష్మీకుమారి దంపతులు (భీమవరం మండలం చినఅమిరం) రూ.50 వేలను విరాళంగా అందజేశారు.



## 100 రోజుల పని

పెదపాడు: ఉపాధి హామీ పథకంలో ప్రతిఒక్కరికీ 100 రోజుల పని కల్పించేలా చర్యలు చేపట్టినట్టు ఏలూరు డ్వామా పీడీ రాంబాబు తెలిపారు. కలపర్రులో పనులను పరిశీలించారు.



## పూడికతీత పరిశీలన

పెనుమంట్ర: బ్రాహ్మణచెరువులో అమృత్ సరోవర్ పథకం కింద ఉపాధి హామీలో చేపట్టిన చెరువు పూడికతీత పనులను 'పశ్చిమ' డ్వామా పీడీ ఎస్టీవీ రాజేశ్వరరావు పరిశీలించారు.

# పర్యాటకం.. ప్రగతి పథం

- ఉమ్మడి జిల్లాలో రూ.2 కోట్లతో పనులు
- కొల్లేరు ఎకో టూరిజానికి రూ.187 కోట్లతో ప్రతిపాదనలు
- ప్రముఖ ఆలయాల వద్ద హెల్ప్‌డెస్క్‌లు
- కొరుటూరు రిసార్ట్స్ **అభివృద్ధికి చర్యలు**



కొల్లేరు సరస్సు



కైకలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పర్యాటక రంగం కొత్త సొబగులు సంతరించుకుంటోంది. కరోనా విపత్తు నుంచి తేరుకుని పర్యాటకుల సంఖ్య పెరగడంతో ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) రూ.2 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ప్రధానంగా టెంపుల్, ఎకో టూరిజంపై దృష్టి సారించింది. ప్రముఖ ఆలయాల సందర్శనకు వచ్చే భక్తులకు సమీప పర్యాటక ప్రాంతాల విశేషాలను తెలియజేసేలా అధికారులు హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నారు. రిసార్ట్స్ వద్ద రెస్ట్ రూమ్‌లను నిర్మిస్తున్నారు. రాష్ట్రంలో అత్యధిక భక్తులు వచ్చే 100 ఆలయాల్లో ద్వారకాతిరుమల, మద్ది ఆంజనేయ స్వామి, పంచారామక్షేత్రాలైన భీమవరం ఉమాసోమేశ్వరస్వామి, పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయాలు, భీమవరం మావుళ్లమ్మ దేవస్థానాలు ఉన్నాయి. ఆయా ఆలయాల వద్ద పర్యాటక శాఖ హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే పాలకొల్లులో ఆలయం వద్ద 300 అడుగుల స్థలాన్ని హెల్ప్‌డెస్క్ కోసం పరిశీలించారు. అలాగే తాడేపల్లిగూడెం వద్ద వే సైడ్ ఎమినిటీ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఒకే ప్రాంతంలో రెస్టారెంట్లు, పెట్రోల్ బంకులు, కాటేజీలు, వెహికల్ పార్కింగ్‌లు అందుబాటులోకి రానున్నాయి.



పట్టిసీమ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న టూరిజం శాఖ అధికారులు



కొరటూరు వద్ద అభివృద్ధి పనులపై చర్చిస్తున్న పర్యాటక శాఖ అధికారులు

### అదనపు గదులు.. అతిథి గృహాలు

కోవిడ్ వల్ల కోలుకోలేని దెబ్బతిన్న పర్యాటక శాఖకు ఉపశమనం కలిగించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.198.50 కోట్ల ప్యాకేజీని కేటాయించింది. దీనిలో భాగంగా ప్రస్తుతం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రూ.2 కోట్లతో పనులు జరుగుతున్నాయి. పాపికొండల యాత్రికులు వెళ్లే కొరటూరు రిసార్ట్స్ వద్ద రూ.70 లక్షలతో యూత్ ఫంక్షన్ హాల్, సోలర్ సిస్టమ్, పైప్‌లైన్, విద్యుత్ పనులను చేస్తున్నారు. అలాగే జల్లేరు జలాశయం వద్ద పర్యాటకుల కోసం రూ.40 లక్షలతో రెండు గదులు, జీలకర్రగూడెం గుంటుపల్లి గుహల వద్ద రూ.30 లక్షలతో అతిథి గృహాలు నిర్మిస్తున్నారు. పేరుపాలెం బీచ్, సిద్ధాంతం, పట్టిసీమ వద్ద అదనపు గదులను ఏర్పాటు చేస్తున్నారు. ఇలా పర్యాటకాభివృద్ధికి ప్రణాళికతో అధికారులు ముందుకెళుతున్నారు.

### కొల్లేరు.. ఎకో టూరిజంతో అలరారు

జిల్లాల పునర్విభజన తర్వాత కొల్లేరు ప్రాంతమంతా ఏలూరు జిల్లా పరిధిలోకి చేరింది. కొల్లేరు ఎకో టూరిజానికి రూ.187 కోట్ల ప్రణాళికతో ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. కొల్లేరు పరీవాహక ప్రాంతాల్లో 20 ప్రదేశాలను గుర్తించి బోటు షికారు, సంప్రదాయ గేలాలతో చేపలు పట్టుకోవడం, పక్షుల వీక్షణ వంటివి ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే 10 ప్రదేశాలను పర్యాటక శాఖ గుర్తించింది. రానున్న రోజుల్లో కొల్లేరు ఎకో టూరిజం పర్యాటక శాఖకు ప్రధాన ఆదాయ వనరుగా మారనుంది.

### పర్యాటకులకు సౌకర్యాలు



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దర్శనీయ ఆలయాలతో పాటు చక్కటి పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. పేరుపాలెం బీచ్ వద్ద అదనపు గదులు నిర్మిస్తున్నారు. ప్రధానంగా కొల్లేరు సరస్సును ఎకో టూరిజంగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక రూపొందించాం. ఇప్పటికే టూరిజం స్పాట్లను గుర్తించాం. ఆలయాల వద్ద హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నాం.

– ఎండీహెచ్ మెహరాజ్, పర్యాటకశాఖ అధికారి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా

## న్యూస్‌రీల్

### శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి శ్రీనివాస్‌కు మెమెంటో అందిస్తున్న ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వుటుకూరు శ్రీనివాస్ శనివారం సాయంత్రం సందర్శించారు. సతీసమేతంగా విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలకగా ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామివారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు.

### ప్రత్యేక కారాగారం తనిఖీ



వంటశాలను పరిశీలిస్తున్న జడ్జి పవన్‌కుమార్

సాక్షి, భీమవరం: భీమవరంలో ప్రత్యేక కారాగారాన్ని శనివారం ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్ తనిఖీ చేశారు. వంటశాలను పరిశీలించారు. రాజీ కేసుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేరారోపణ ఎదుర్కొంటూ రిమాండ్‌లో ఉన్న వారికి న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. జైలు శిక్ష మానసిక పరివర్తన, క్రమశిక్షణ, బాధ్యతలను నేర్పుతుందన్నారు. వచ్చేనెల 11న జరిగే జాతీయ లోక్‌అదాలత్ ద్వారా జైలు ముద్దాయిల కేసులు కూడా పరిశీలించినున్నట్టు చెప్పారు. ఉచిత న్యాయ సలహాదారుడు లోకేశ్వరరావు, జైలు పర్యవేక్షణాధికారి డి.వెంకటగిరి, ఎ.కుమార్‌స్వామి పాల్గొన్నారు.

### రబీకి వంతుల వారీగా నీరు

భీమవరం(ప్రకాశం చౌక్): రబీ పంటకు నీటి విడుదలలో వంతుల వారీ విధానాన్ని శనివారం నుంచి అమలు చేస్తున్నట్టు జిల్లా నీటి వనరుల అధికారి పి.నాగార్జునరావు ఓ ప్రకటనలో తెలిపారు. గోదావరి నది నుంచి నీటి లభ్యత తక్కువగా ఉండటం వల్ల రబీ పంటకు సాగునీటిని అందజేయాలనే ఉద్దేశంతో కాలువలకు నీటి విడుదలలో వంతుల వారీ విధానాన్ని అనుసరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా మండలాల పరిధిలో ఏఏ తేదీల్లో సాగునీరు విడుదల ఉంటుందో వివరాలను రైతు భరోసా కేంద్రాలు, మండల వ్యవసాయ అధికారులకు అందజేసి విస్తృత ప్రచారం చేయించామని తెలిపారు.

### లేసు కేంద్రంలో శిక్షణ

నరసాపురం రూరల్: అంతర్జాతీయ లేసు ట్రేడ్ సెంటర్ శనివారం నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ (ఈపీసీహెచ్) ఇండియా దక్షిణాది రాష్ట్రాల సంచాలకుడు కలవకొలను నాగ తులసీరావు జ్యోతి ప్రజ్వలనం చేసి శనివారం ప్రారంభించారు. స్థానిక ఐఎల్‌టీసీ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో తులసీరావు మాట్లాడుతూ ఇండియా ఎక్స్‌పొజిషన్ మార్ట్ లిమిటెడ్, గ్రేటర్ నోయిడా వారి సహకారంతో వ్యాపార నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం, మార్కెటింగ్ మద్దతుతో భారతీయ హస్త కళాకారులు, ఉత్పత్తిదారుల సమూహాలకు ఎన్జీవో క్రాఫ్ట్ సంస్థలు, సూక్ష్మ పారిశ్రామిక వేత్తలకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. సొసైటీలు తమ ఉత్పత్తులను ఈ కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లో మార్కెటింగ్ చేయవచ్చన్నారు. ప్రోగ్రామ్ డైరెక్టర్ హర్బిందర్ సింగ్, ఈపీసీహెచ్ సదరన్ రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్‌సింగ్, కమిటీ సభ్యుడు కల్వకొలను రామచంద్రుడు, ఎగుమతిదారులు పాల్గొన్నారు.

## అవకాశాలే లక్ష్యంగా నైపుణ్య శిక్షణ

**కలెక్టర్ ప్రశాంతి**



భీమవరం(ప్రకాశంచౌక్): అవకాశాలు అందిపుచ్చుకోవడమే లక్ష్యంగా నైపుణ్య శిక్షణలు సాగాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం నైపుణ్య శిక్షణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని నైపుణ్యాభివృద్ధి కళాశాలల్లో ఆఫీస్ రూమ్, హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయడంతో పాటు ఏఏ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారనే అంశాలపై ప్రచారం చేయాలన్నారు. జిల్లాలోని పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇవ్వాలన్నారు. నిరంతరం రెండు లేక మూడు బ్యాచ్‌లకు శిక్షణా తరగతుల నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణపై యాప్ రూపొందించి, విద్యార్థులు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. భీమవరం ప్రభుత్వ ఐటీఐ కళాశాల, పాలకొల్లు డీఎన్ఆర్ మహిళా కళాశాల, దుంపగడప వీవీఆర్ వీవీగిరి ప్రభుత్వ కళాశాల, ఆచంట ప్రభుత్వ ఐటీఐ కళాశాల, తణుకు ఎస్‌సీఐఎం ప్రభుత్వ కళాశాలల్లో స్కిల్‌హబ్‌లను, పీఎం లంక డిజిటల్ కమ్యూనిటీ భవనంలో స్కిల్ కళాశాలను ఏర్పాటుచేశామన్నారు. డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎ.కృష్ణారెడ్డి, జాబ్స్ డిస్ట్రిక్ మేనేజర్ కె.పార్థసారథి, ఆర్అండ్‌బీ ఈఈ లోకేశ్వర్, జేఈఓ ఎం.విజయ్‌కుమార్, ఉండి ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

### సెబ్ అసిస్టెంట్ కమిషనర్ల బదిలీ

సాక్షి, భీమవరం: భీమవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అసిస్టెంట్ కమిషనర్‌గా వై.శ్రీనివాసచౌదరి నియమితులయ్యారు. శ్రీనివాసచౌదరి ప్రస్తుతం ఏలూరు సెబ్ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. భీమవరంలో ఇప్పటివరకూ పనిచేసిన ఏటీవీ రవి కుమార్ ఏలూరుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.

## సమర్థంగా కోర్టు మానిటరింగ్ సిస్టమ్

**డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి**



మాట్లాడుతున్న డీజీపీ

సాక్షి, భీమవరం: భీమవరం కేంద్రంగా ఏర్పడిన పశ్చిమగోదావరి జిల్లాలో కోర్టు మానిటరింగ్ సిస్టమ్ సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక శ్రీవిష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాలోని పోలీసు అధికారులతో శనివారం ఆయన సమీక్షించారు. ముందుగా జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ పవర్ పాయింట్ ప్రజెంట్ ద్వారా పోలీసు సబ్ డివిజన్, స్టేషన్లు, కేసులు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, దిశ యాప్ వినియోగం, సారా నిర్మూలనకు చేపట్టిన చర్యలు తదితర వివరాలను వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ జిల్లాలో ప్రాపర్టీ నేరాలకు సంబంధించి రికవరీ బాగుందని ప్రశంసించారు. కోర్టు మానిటరింగ్ సిస్టమ్ సమర్థవంతంగా పనిచేయాలని, దీనిని జిల్లా హెడ్‌క్వార్టర్, సబ్ డివిజన్, సర్కిళ్లలో ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని డీఎస్పీ, సీఐ, ఎస్సైలంతా తమ పరిధిలో పెండింగ్ ట్రయల్ కేసులు పదింటిని తీసుకొని వాటి విచారణ వేగవంతం చేసి ముద్దాయిలకు త్వరగా శిక్ష పడేలా చూడాలని ఆదేశించారు. దిశ కేసులను త్వరితగతిన దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గత ఆరు నెలల్లో 40 దిశ కేసుల్లో ముద్దాయిలకు శిక్ష పడిందన్నారు. ఏలూరు డీఐజీ జి.పాలరాజు, అడిషనల్ ఎస్పీలు ఏటీవీ రవి కుమార్, ఏవీ సుబ్బరాజు, డీఎస్పీలు కేవీ సత్యనారాయణ, బండారు శ్రీనాథ్, మనోహరాచారి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

### సదా వేంకటేశాం.. స్మరామి



శ్రీనివాసా.. గోవిందా.. శ్రీ వేంకటేశా.. గోవిందా.. స్మరణలు మార్మోగాయి. చినవెంకన్న క్షేత్రం భక్తజన సంద్రాన్ని తలపించింది. శనివారంతోపాటు పాటు రథసప్తమిని పురస్కరించుకుని వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అధిక సంఖ్యలో వివాహ, ఒడుగు కార్యక్రమాలు జరిగాయి.

-ద్వారకాతిరుమల

## అన్నదాతల ఆనందోత్సాహం





తణుకులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఇరగవరంలో క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

- ధాన్యం సొమ్ములు సకాలంలో అందడంపై హర్షం
- సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

తణుకు అర్బన్: సార్వా పంట ధాన్యం సొమ్ము సకాలంలో అందించి వ్యవసాయంలో తమకు ఊతమిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని, థ్యాంక్యూ సీఎం సార్ అంటూ రైతులు నినదించారు. శనివారం తణుకు నరేంద్ర సెంటర్‌లో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞత తెలిపారు. ధాన్యం సొమ్ములు ఐదు నుంచి పది రోజుల్లో జమచేశారని, గతంలో బస్తాకు రూ.1,100 మాత్రమే అందగా ప్రస్తుతం రూ.1,530 ఇవ్వడం శుభపరిణామమన్నారు. రైతులతోపాటు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, తణుకు మండల అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్ (పీబీఆర్), ఎంపీపీ రుద్రా ధనరాజు, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, పెన్మెత్స రామరాజు, యిండుగపల్లి బలరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**పాలనా దక్షతకు నిదర్శనం**

తణుకు టౌన్: గతంలో ఎన్నడూ లేనివిధంగా ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరను ఒక్క రూపాయి కూడా తగ్గకుండా రైతులకు అందించడం సీఎం జగన్, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పరిపాలనా దక్షతకు నిదర్శనమని దువ్వ సొసైటీ అధ్యక్షుడు జేకే కృష్ణంరాజు అన్నారు. దువ్వ గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద సీఎం జగన్ చిత్రపటానికి రైతులు క్షీరాభిషేకం చేశారు. గతంలో ధాన్యం కొనుగోలు, విక్రయాల్లో అక్రమాలు జరిగాయని, వాటన్నింటినీ ప్రభుత్వం ప్రక్షాళన చేసి కొత్త విధానంలో ధాన్యం సేకరించడం రైతులకు మేలు చేసిందని కృష్ణంరాజు అన్నారు. దువ్వలో 1,378 మంది రైతుల నుంచి 71,313 క్వింటాళ్ల ధాన్యం సేకరించి రూ.14 కోట్ల 54 లక్షల 80 వేల 566ను ఖాతాల్లో జమచేశారన్నారు. సర్పంచ్ అడ్డా బాబు, మండల రైతు సంఘ అధ్యక్షుడు డీవీ కృష్ణంరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎస్.గోపాలకృష్ణ, ఉప సర్పంచ్ కడియం రాంబాబు, ఎంపీటీసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**రైతు సంక్షేమమే లక్ష్యంగా..**

ఇరగవరం: రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పనిచేస్తున్నారని డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు అన్నారు. ఇరగవరంలో సీఎం జగన్ చిత్రపటానికి రైతులు, నాయకులు క్షీరాభిషేకం చేశారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించి కనీస మద్దతు ధర అందించడం అభినందనీయమని ఆయన అన్నారు. దీని వల్ల రైతులకు చాలా మేలు జరిగిందన్నారు. సకాలంలో రైతులకు ఖాతాలకు ధాన్యం సొమ్ములు జమచేయడం శుభపరిణామమన్నారు. విత్తు నుంచి ధాన్యం విక్రయం వరకూ రైతులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, ఎంపీటీసీ పాలా పాలేశ్వరరావు, వీరవల్లి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

### 31న మెగా జాబ్‌మేళా

నూజివీడు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్ ఆవరణలో ఈనెల 31న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో 15 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, దాదాపు వెయ్యి మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. మేళాను ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభిస్తారని, పది, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18 నుంచి 35 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ 8374039719లో సంప్రదించాలని కోరారు. అభ్యర్థులు బయోడేటా, ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

## క్లుప్తంగా

### గంజాయి ముఠా అరెస్టు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఓ ముఠాకు చెందిన ముగ్గురు యువకులను అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ.1,21,500 విలువైన 24.250 కేజీల గంజాయిను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగరాజు శనివారం చెప్పారు. పట్టణంలోని సత్యవతినగర్‌కు చెందిన సాయి సూర్యచరణ్, పెనుగొండ మండలం సిద్ధాంతంకు చెందిన నవీన్, బి.సాయిరామ్ వ్యసనాలకు బానిసలై డబ్బు సంపాదన కోసం విశాఖపట్టణంలో గంజాయి కొనుగోలు చేసి పట్టణంలో అధిక ధరకు విక్రయిస్తున్నారు. పట్టణంలోని కడకట్ల వంతెన కింద గంజాయి బ్యాగులతో ఉన్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి దాడి చేసి యువకులను పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు తడికలపూడి విద్యార్థులు



కామవరపుకోట: రాష్ట్ర స్థాయి పోటీలకు తడికలపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని జెడ్పీటీసీ సభ్యుడు కడిమి రమేష్ శనివారం చెప్పారు. అండర్–17 విభాగంలో ఇటీవల రాష్ట్ర స్థాయిలో కడపలో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో బొట్ల శ్యామ్‌కుమార్, కాకినాడలో జరిగిన బేస్‌బాల్ పోటీల్లో కొత్తపల్లి పార్థసారథి, శ్రీకాకుళంలో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో కొండపల్లి పవన్‌కుమార్ ప్రతిభ కనబరిచారన్నారు. వీరికి రమేష్ బహుమతులు అందజేసి అభినందించారు. పీడీ మారగని నరసింహరాజా, జెడ్పీటీసీ, సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, హెచ్ఎం జి.రామకృష్ణ అభినందించారు.

# దినకరా.. శుభకరా

**● కన్నులపండువగా సూర్యభగవానుడి కల్యాణం ● భక్తజనంతో తణుకు సూర్యదేవాలయం కిటకిట**



తణుకులో స్వామివారిని దర్శించుకున్న మంత్రి కారుమూరి



సూర్యభగవానుడి ఆలయం వద్ద భక్తుల సందడి

తణుకు అర్బన్: ఉష, పద్మిని, ఛాయ, సౌంజ్ఞ సమేతుడైన శ్రీ సూర్యభగవానుడి కల్యాణం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. రథసప్తమి సందర్భంగా దేవదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో తణుకు సూర్యదేవాలయంలో పండితుల వేద మంత్రోచ్ఛరణలు, భాజాభజంత్రీల నడుమ శ్రీ సూర్యభగవానుడి కల్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. తణుకు సూర్యదేవాయం ఎదురుగా ఉన్న స్వామి కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పండితులు కల్యాణం జరిపించారు. ఆలయ చైర్మన్ పెన్మెత్స త్రిమూర్తుల సీతారామచంద్రరాజు, సరోజిని దంపతులు స్వామివారి కల్యాణ ఘట్టాన్ని పీటలపై కూర్చుని నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రసాద్ ఆచార్యులు నేతృత్వంలో వేద పండితులు పూజాదికాలు జరిపారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారికి పుష్పయాగం అత్యంత వైభవంగా జరిగింది. పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. అలయ చైర్మన్ పెన్మెత్స త్రిమూర్తుల సీతారామచంద్రరాజు సహకారంతో భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు.



ఆలయంలో సూర్యభగవానుడి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**స్వామివారిని దర్శించుకున్న మంత్రి కారుమూరి**

రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సూర్యభగవానుడిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ పెన్మెత్స త్రిమూర్తుల సీతారామచంద్రరాజు, ఆలయ కార్యనిర్వహణాధికారి ముత్యాల సత్యనారాయణ, అర్చకులు మంత్రి కారుమూరికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం మంత్రి కారుమూరి స్వామివారి కల్యాణ ఘట్టాన్ని వీక్షించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వావిలాల సరళాదేవి, సూరంపూడి కామేష్, తాటిపర్తి శ్రీనివాసు, గెద్దాడ శ్రీకాంత్ ఉన్నారు.

**భారీగా క్యూలైన్లు**

రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా అరసవల్లి తరువాత తణుకు సూర్యదేవాలయం రెండో ఆలయం కావడంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే భక్తులు బారులు తీరారు. సూర్యాలయం వీధి, బాబువారి వీధి, పిండిమర్ల వీధులు పూర్తిగా భక్తులతో నిండిపోగా రాష్ట్రపతి రోడ్డులోని జెడ్పీ బాయ్స్ హైస్కూలు వరకు భక్తులు క్యూలో నిరీక్షించారు. సుమారుగా 50 వేల మంది భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నారు.



చంద్ర ప్రభ వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

# దివ్య తేజోమయా.. ధన్యోస్మి

**● సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగిన దేవదేవుడు**
**● శ్రీవారి ఆలయంలో వైభవంగా రథసప్తమి వేడుకలు**

ద్వారకాతిరుమల: అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడిని ప్రత్యక్షంగా సేవించి భక్తులు పరవశించారు. శ్రీవారి పాదపద్మాలను దివ్యకిరణాలతో స్పృశించి పునీతమయ్యారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని చినవెంకన్న ఆలయంలో శనివారం ఉదయం సూర్యప్రభ వాహనంపై తేజోవిరాజితుడైన శ్రీవారిని వీక్షించిన భక్తులు తన్మయత్వం చెందారు. అలాగే రాత్రి చంద్రప్రభ వాహనంపై విహరించిన స్వామివారిని భక్తులు దర్శించి మైమరిచిపోయారు. వేడుకల్లో భాగంగా ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలో విశాఖ జిల్లా దువ్వాడకు చెందిన నూకాంబిక కోలాట భజన బృందం ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

**అట్టహాసంగా ఉత్సవం**

ద్వారకాతిరుమల దివ్యక్షేత్రంలో సూర్య జయంతిని పురస్కరించుకుని శ్రీవారు సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై మెరిశారు. ఉదయం ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన సూర్యప్రభ వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి అర్చకులు విశేష పూజలు జరిపి, హారతులిచ్చారు. తర్వాత కోవెల చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి, ఉత్సవాన్ని అట్టహాసంగా జరిపారు. క్షేత్ర పురవీధుల్లో జరగాల్సిన ఈ వాహన సేవ అనివార్య కారణాల వల్ల కోవెలకే పరిమితమైంది. రాత్రి శ్రీవారు చంద్రప్రభ వాహనంపై ఉభయ దేవేరులతో తిరువీధులలో విహరించారు. ముందుగా అర్చకులు ఆలయంలో స్వామి, అమ్మవార్లను చంద్రప్రభ వాహనంపై వేంచేపు చేసి హారతులిచ్చారు. అనంతరం స్వామివారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, గజ, అశ్వ సేవలు నడుమ ప్రతి ఇంటి ముంగిటకు వచ్చిన శ్రీవారికి భక్తులు నీరాజనాలు సమర్పించారు. ఈ వేడుకలు ఆద్యంతం భక్తులకు కనువిందు చేశాయి.



# విద్యలో నిర్లక్ష్యంపై చర్యలు తప్పవు

**● అధికారులపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అసహనం**
**● ఆకివీడులోని శివాలయం, ఈస్టుపాలెం స్కూళ్ల ఆకస్మిక తనిఖీ**



ఆకివీడు శివాలయం స్కూల్‌లో విద్యార్థుల వర్కు బుక్‌లను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, కలెక్టర్ ప్రశాంతి

ఆకివీడు: పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల చదువులపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అసహనం వ్యక్తం చేశారు. చదువుల తీరుపై పరిశీలన చేయని అధికారుల నుంచి ఫిబ్రవరి 15వ తేదీ లోగా సంజాయిషీ తీసుకోవాలని చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతిని ఆదేశించారు. నగర పంచాయతీ పరిధిలోని శివాలయం, ఈస్టుపాలెం ప్రాథమిక పాఠశాలలను శనివారం ప్రవీణ్ ప్రకాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మూడో తరగతి విద్యార్థుల పుస్తకాలను ఆయన పరిశీలించారు. డిసెంబర్ నుంచి విద్యార్థుల నోట్ పుస్తకాలు ఖాళీగా ఉండటం గమనించి వీటిని ఎందుకు వినియోగించలేదని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. దీనిపై తనిఖీ చేయడం లేదని గుర్తించి ఎంఈఓ, డీవైఈఓ, డీఈఓ, ఆర్జేడీలను ప్రశ్నించారు. ఉపాధ్యాయుడు పనితీరు, విద్యార్థుల చదువుతీరును విద్యాశాఖ అధికారులు పరిశీలించడంలేదని స్పష్టమైందని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, అధికారులు పనిచేస్తున్నా, పనితీరు ఇంకా మెరుగుపరుచుకుని ప్రభుత్వ పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థను పునాది స్థాయి నుంచి పటిష్టపరచి, పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించాలనే లక్ష్యం ఆంగ్ల విద్యను అందుబాటులోకి తీసుకువస్తుంటే ఎందుకింత నిర్లక్ష్యమని నిలదీశారు. ఇంకా సిలబస్ కూడా పూర్తి చేయకపోవడాన్ని ప్రశ్నించారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడం లేదని, అటువంటప్పుడు విద్యార్థులకు పూర్తి స్థాయిలో బోధన అందజేయాల్సి ఉందన్నారు. నాడు–నేడు పనులు, రికార్డులను పరిశీలించి.. నిధులున్నప్పటికీ ఎందుకు వినియోగించలేదని ఏఈని ప్రవీణ్ ప్రకాష్ ప్రశ్నించారు. పనులు జరుగుతున్నప్పుడు వాటికి చెల్లించాల్సిన బిల్లులు చెల్లించకుండా ఖాతాల్లో ఎందుకు నిల్వ ఉంచుతున్నారని ప్రశ్నించారు. ఈస్టుపాలెం స్కూల్‌లో మధ్యాహ్న భజన పథకంలో వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. మోనూ ప్రకారం వంట చేస్తున్నారా అని నిర్వాహకుల్ని ప్రశ్నించారు. బిల్లులు జనవరి వరకూ వచ్చాయా అని అడుగగా వచ్చాయని నిర్వాహకులు సమాధానమిచ్చారు. కోడిగుడ్ల సరఫరా బాగా ఉందా, నిర్లక్ష్యంగా సరఫరా చేస్తున్నారా అని ప్రశ్నించగా బాగుందని చెప్పారు. ప్రవీణ్ ప్రకాష్ వెంట జిల్లా కలెక్టర్ ప్రశాంతి, జేసీ మురళీకృష్ణ, ఆర్జేడీ మధుసూదనరావు, డీఈఓ వెంకటరమణ, డీవైఈఓ శ్రీరామ్, ఎంఈఓ ఏ.రవీంద్ర, పంచాయతీరాజ్ ఏఈ రమణమ్మ, తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీకర్ పాల్గొన్నారు.

# లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలి

**● హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య**
**● తణుకులో ఘనంగా ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల పట్టభద్రుల స్నాతకోత్సవం**



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న రాష్ట్ర హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ నైనాల జయసూర్య

తణుకు టౌన్: విద్యార్థులు భారతరత్న అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకుని నిరంతరం లక్ష్యసాధన కోసం కృషి చేయాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య అన్నారు. శనివారం తణుకులోని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యం సాధించే దిశగా నిరంతరం ప్రయత్నించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సివిల్ జడ్జి పోస్టుల భర్తీలో సుమారు 60 శాతం మంది మహిళలే అర్హత సాధించారన్నారు. దీనికి యాజమాన్యం, అంకిత భావంతో పనిచేసే అధ్యాపక సిబ్బందే కారణమన్నారు. 40 ఏళ్ల క్రితం బాలికల విద్య కోసం గ్రామీణ ప్రాంతంలో ప్రత్యేక కళాశాలను ఏర్పాటు చేయడం, దానిని మరింత సమర్థవంతంగా నిర్వహించి మహిళా సాధికారత దిశగా నడిపించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కళాశాల 3వ, 4వ, 5వ పట్టభద్రుల స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించి, న్యాయమూర్తి చేతుల మీదుగా డిగ్రీ పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి ప్రారంభించగా, సభకు ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షత వహించారు. కళాశాల చైర్మన్ కేవీ సుబ్బారావు, గవర్నింగ్ బాడీ కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి, జాయింట్ సెక్రటరీ వెంకట కృష్ణారావు, కోశాధికారి నందిగం సుధాకర్, మేనేజ్‌మెంట్ సభ్యులు ఏవో డి.సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ యు.లక్ష్మీసుందరీబాయి, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# గూడెంలో వైభవంగా ఇస్కాన్ శాఖ ప్రారంభం



ఇస్కాన్ టెంపుల్‌లో జగన్నాథస్వామి వారికి పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) తాడేపల్లిగూడెం శాఖ శ్రవణ కీర్తన నూతన భవనాన్ని సత్యవతి నగర్ చెట్లు రోడ్డులో ఆహ్లాదకరమైన వాతావరణంలో శనివారం ఉదయం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. భక్తులు విశేషంగా పెద్ద సంఖ్యలో హాజరై జగన్నాథస్వామి వారిని దర్శించారు. రాష్ట్రంలోని వివిధ ముఖ్య ప్రాంతాల నుంచి విచ్చేసిన ఇస్కాన్ ముఖ్యులు చక్రధారి దాస్, రమణ్ ప్రభుజీ, మాధవ దాస్, వివిధ ప్రాంతాల ఇస్కాన్‌ల నిర్వాహకులు, భక్తులు హాజరయ్యారు. దర్శన హారతి, గురుపూజ, భాగవత ప్రవచనం, జగన్నాథ బలదేవ సుభద్రలకు పుష్పాభిషేకాలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం భారీ అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం తులసి, సంధ్యా హారతి, భగవద్గీత ప్రవచనం కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వాహకులు మురళీనాథ్ శ్యామ్‌దాస్ మాట్లాడుతూ ఇస్కాన్‌లో ప్రతిరోజూ నిర్వహించే వివిధ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ఇస్కాన్ టెంపుల్‌లో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని, ప్రతి ఆదివారం ఉదయం 11 గంటలకు పిల్లల కోసం భక్త ప్రహ్లాద బడి (సండే స్కూల్), సాయంత్రం 4.30 గంటలకు యువత, పెద్దలకు భక్తి వృక్ష ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. ఇస్కాన్ టెంపుల్‌ను దర్శించాలని భక్త జనాలకు ఆహ్వానం పలికారు.

## ప్రతి ఇంటికీ సంక్షేమం



తణుకు అర్బన్: తణుకు 12వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ వృద్ధుడికి బ్రోచర్ అందించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

# స్మోక్ ఫ్రీ జోన్‌లో దుకాణాల తనిఖీ



శ్రీవారి ఆలయ పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రామ్ అధికారిణి మానస, తదితరులు

ద్వారకాతిరుమల : శ్రీవారి క్షేత్రంలోని స్మోక్ ఫ్రీ ప్రాంతాల్లో పొగాకు ఉత్పత్తులు, వాటి వినియోగం జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని నాన్ – కమ్యునికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) జిల్లా ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ సీహెచ్ మానస ఆలయ అధికారులకు సూచించారు. ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు, వినియోగ నిషేధంపై వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్, దేవదాయశాఖ అధికారులు సంయుక్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ సెకండ్ స్పెషల్ డ్రైవ్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస, ఎస్సై టి.సుధీర్, ఆలయ సూపరింటెండెంట్‌లు రమణరాజు, వాసు తదితరులతో కలసి ఆలయ పరిసరాల్లోని పలు దుకాణాలను తనిఖీ చేసి, పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని వ్యాపారులను హెచ్చరించారు. అలాగే పొగతాగే ప్రాంతాలను సందర్శించి, నివారణా చర్యలు చేపట్టాలని దేవస్థానం సిబ్బందికి సూచించారు. ఈ డ్రైవ్‌లో డాక్టర్ ప్రియాంక, డిప్యుటీ తహసీల్దార్ దుర్గా మహాలక్ష్మి, ఎన్‌టీసీపీ సైకాలజిస్ట్ కె.చినవీర్రాజు, డీసీఎం ఎస్.వెంకట్ తదితరులున్నారు.

# షోరూమ్ యజమానికి టోకరా.. ఇద్దరిపై కేసు

జంగారెడ్డిగూడెం: యజమానిని మోసం చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు శనివారం చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన బాలిరెడ్డి శ్రీనివాసరెడ్డి టెక్స్‌టైల్స్ వ్యాపారం చేస్తున్నారు. తన ఏడో బ్రాంచ్‌గా జంగారెడ్డిగూడెంలో బీఎస్ఆర్ ఫ్యాబ్రిక్స్ ఆథరైజ్డ్ ఫ్రాంచైజీ షోరూమ్‌ను 2021లో ప్రారంభించారు. ఈ షోరూమ్‌కు సేల్స్ మేనేజర్‌గా ములగలంపల్లికి చెందిన కొప్పుల రాజేష్, సేల్స్‌బాయ్‌గా నల్లపు రత్నగాంధీని నియమించుకున్నారు. అదే ఏడాది మే నెల నుంచి సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, సేల్స్ వాల్యూమ్ తగ్గుతోందని యజమానికి రిపోర్ట్ చేసేవారు. తరువాత సేల్స్ నిల్ అని పెట్టేవారు. అదే ఏడాది నవంబర్‌లో శ్రీనివాసరెడ్డి షోరూమ్‌కు రాగా షాపులో దుస్తులు కొన్నా సిబ్బంది బిల్లు ఇవ్వలేదంటూ కొందరు ఖాతాదారులు శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేశారు. అయితే సదరు లావాదేవీలకు సంబంధించి సొమ్ములను రాజేష్ వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు వేయడం జరిగిందని ఖాతాదారులు తెలిపారన్నారు. అలాగే అమ్మకాల నగదును బ్యాంకులో డిపాజిట్ చేయకుండా వారి వద్దనే ఉంచుకోవడం, ఆఫర్స్‌ను దుర్వినియోగం చేయడం తదితర మొత్తంగా రూ. 10,26,556 నగదును దొంగిలించినట్లు శ్రీనివాసరెడ్డి గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా రాజేష్, రత్నగాంధీ బావ బావమరిదులని, ఉద్దేశపూర్వకంగా మోసం చేసినట్లు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నట్లు ఎస్సై తెలిపారు.

# అర్హులందరికీ పారదర్శకంగా పథకాల అమలు

**తణుకు అర్బన్:** ప్రతి గడపలోనూ జగన్ మా ఇంటి బిడ్డ అంటున్న వైనం చాలా సంతోషాన్ని కలిగిస్తోందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. తణుకు 12వ వార్డులో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పారదర్శకంగా అర్హులందరికీ అందుతున్న సంక్షేమ పథకాలను చూసి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని మళ్లీ జగన్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని అన్నారు. సార్వా పంట ధాన్యం కొనుగోళ్ల సొమ్ము వేగవంతంగా అందజేయడాన్ని రైతులు సంతోషంగా స్వాగతిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా స్థానికులు తెలిపిన పలు సమస్యలను మంత్రి కారుమూరి అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పట్టణ మహిళా ధ్యక్షురాలు నూకల కనకదుర్గ, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉండవల్లి జానకి, వావిలాల సరళాదేవి, నత్తా కృష్ణవేణి, స్థానిక నాయకులు సామంతుల అప్పారావు, గోడి నాగబాబు, ఎలిపే చిన్ని, ఇల్లా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**పశువులకు సత్వర వైద్యసేవలు**

**అత్తిలి:** పశువులకు సత్వర వైద్యసేవలు అందించేందుకు డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాల అంబులెన్స్‌లు దోహదపడుతున్నాయని మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు చెప్పారు. శనివారం అత్తిలి మండలానికి మంజూరైన సంచార పశువైద్యశాల అంబులెన్స్‌ను ఆయన ప్రారంభించారు. 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్‌చేస్తే అంబులెన్స్ రైతు ఇంటివద్దకే వచ్చి పశువైద్య సేవలు అందిస్తారని అన్నారు. ఇందులో డాక్టరు, వెటర్నరీ అసిస్టెంట్, డ్రైవర్ కం అటెండర్ ఉంటారని ఉంటారన్నారు. ఈ అంబులెన్స్‌లో ఉచితంగా రక్త, పేడ పరీక్షలు నిర్వహించి, మందులను అందజేస్తారని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కె నరశింహారావు తెలిపారు. ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, మండల పశువైద్యాధికారి డాక్టర్ కె శంకరభావన్నారాయణ, పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి**

**ఇరగవరం:** రేలంగి తాటకేశ్వరా స్వామి ఆలయంలో శనివారం ఆలయ ధ్వజ స్తంభం పునః ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పౌర సరఫరాల, వినియోగదారుల వ్యవహారాల మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ముఖ్య అతిథి పాల్గొన్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణ కుంభంలో స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పురాతన ఆలయాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు మంత్రి కారుమూరి పేర్కొన్నారు. గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పులుపు అనిల్, ఉప సర్పంచ్ పులుపు అక్కమాంబ, ఎంపీటీసీ సభ్యురాలు కిరణ్మయి, నాయకులు చేబ్రోలు పెద్దిరాజు, పులుపు శ్రీనివాస్, పులుపు సునీల్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.


తణుకులో లబ్ధిదారులకు సంక్షేమాన్ని వివరిస్తున్న మంత్రి కారుమూరి

## క్లుప్తంగా

### అధునాతన సౌకర్యాలతో అదనపు తరగతి గదులు


అత్తిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

**అత్తిలి:** అధునాతన సౌకర్యాలతో అదనపు తరగతి గదులు మార్చి 15నాటికి సిద్ధంచేయాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అధికారులను ఆదేశించారు. అత్తిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టిన మన బడి నాడు–నేడు పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన అదనపు తరగతి గదుల నిర్మాణంపై సంబంధిత సహాయ ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యనభ్యసించేలా గదులను తీర్చిదిద్దాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్జేడీ డి మధుసూదన్, డీఈవో ఆర్ వెంకటరమణ, సమగ్రశిక్ష అభియాన్ సమన్వయకర్త శ్యామ్ సుందర్, ఎంఈవో శారదాజ్యోత్స్న, హెచ్ఎం ప్రేమజ్యోతి పాల్గొన్నారు.

### ముత్యాలమ్మవారి వెండి చీర తయారీకి విరాళం

**తాడేపల్లిగూడెం రూరల్:** ముత్యాలంబాపురం ముత్యాలమ్మవారి వెండి చీర తయారీకి తణుకుకు చెందిన గంధం ఆదినారాయణ–రమాదేవి, గంధం వెంకటేష్– శ్రీదేవి, గంధం భానుప్రసాద్– సుమలత, గిరిశాల నాగరాజు–విజయలక్ష్మి దంపతులు శనివారం రూ.24 వేలు విరాళం అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, కార్యనిర్వహణాధికారి పి.హరేరామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

### జీ తెలుగు 'సరిగమప'కు నజీరుద్దీన్ ఎంపిక

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** తాడేపల్లిగూడెం వీకర్స్ కాలనీకి చెందిన వర్ధమాన గాయకుడు నజీరుద్దీన్ ఈ నెల 29న ఆదివారం రాత్రి 9 గంటలకు జీ తెలుగులో ప్రచారమయ్యే 'సరిగమప' చాంపియన్ షిప్‌కు ఎంపికయ్యారు. నజీరుద్దీన్‌ను ఘంటసాల గానసభ ఆధ్వర్యంలో అభినందించారు. గానసభ అధ్యక్షుడు కాసిం, సెక్రటరీ జేకే కృష్ణ, నాగూర్, అల్లం శంకరరావు, ఎస్ఎస్ఆర్ మూర్తి, ఆలీ, రంగస్థల కళాకారుల సంఘం గౌరవాధ్యక్షుడు సూరంపూడి వెంకటరమణ, డాక్టర్ మాలతీమాధవ్, సభ్యులు నజీరుద్దీన్‌ను ప్రశంసించారు.

### చెరువులోకి ట్రాక్టర్ బోల్తా

**తాడేపల్లిగూడెం రూరల్:** ట్రాక్టర్ అదుపు తప్పి పక్కనే ఉన్న చెరువులోకి బోల్తా కొట్టిన ఘటన శనివారం పెదతాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తప్పించుకోగా, మరో యువకునికి తీవ్రగాయాలైనట్లు సమాచారం. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. స్థానికులు స్పందించి జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను వెలికితీశారు.

### తణుకు ఏఎంసీ చైర్మన్‌గా నత్తా కృష్ణవేణి

**తణుకు అర్బన్:** తణుకు ఏఎంసీ చైర్మన్‌గా నత్తా కృష్ణవేణిని నియమించినట్టు మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు వెల్లడించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు వివరాలు పంపుతున్నట్లు ఆయన వివరించారు.

# మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై వినతి

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** మునిసిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి ఫేస్ రీడింగ్ అటెండెన్స్‌లో మినహాయింపు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూసనపూడి సోమసుందర్ విజ్ఞప్తి చేశారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా శనివారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కార్మిక నాయకులు కార్మికులతో మాట్లాడుతూ రోజుకు నాలుగు సార్లు కార్మికులే స్వయంగా వారి మొబైల్‌లో ఫేస్ రీడింగ్ అటెండెన్స్ తీసుకోవడం ఆచరణ సాధ్యం కాదని తెలిపారు. కార్మికులకు అందరికి స్మార్ట్ ఫోన్లు లేవని, చాలా మందికి యాప్‌లు వినియోగించే నైపుణ్యం లేదని వెల్లడించారు. హాజరు నమోదు బాధ్యతను మేస్త్రీలు, ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళింగ లక్ష్మణరావు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు తదితరులు కమిషనర్ బాలస్వామికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**అత్తిలి:** రైతులు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి, సకాలంలో లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమ చేసిందని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అన్నారు. అత్తిలి మండలంలో రైతులకు ధాన్యం సొమ్ము రైతు ఖాతాల్లో సకాలంలో జయ చేసినందుకు కృతజ్ఞతగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు చిత్రపటాలకు రైతులు శనివారం క్షీరాభిషేకం చేసారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ అత్తిలి మండలంలో 6,041 మంది రైతులకు రూ. 58 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసారని, ఇప్పటి వరకు రూ. 57 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, సర్పంచ్ గంటావిజేతనాగరాజు, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు గంటానాగరాజు, ఏటి టీకే రాజేష్ పాల్గొన్నారు.


అత్తిలిలో సీఎం జగన్, మంత్రి కారుమూరి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

# సూర్యదేవాలయంలో ఘనంగా రథ సప్తమి వేడుకలు

**అత్తిలి:** స్థానిక ఉమాసిద్దేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన సూర్యదేవాలయంలో రథ సప్తమి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం వేకువ జామున సూర్యభగవానుడికి అభిషేక పూజలు నిర్వహించి, విశేషంగా అలంకరించారు.స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు సూర్యభగవానుడిని దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ బండి అంజన్న, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ పాల్గొన్నారు.

**సూర్యనారాయణ స్వామికి పంచామృతాభిషేకాలు**

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో రథ సప్తమి సందర్భంగా శనివారం సూర్యనారాయణ స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మండవల్లి చెన్న నాగేంద్రరావు, ట్రెజరర్ నున్న బాల త్రిపుర సుందరరావు, సెక్రటరీ ఆలపాటి చిన్న, కే.శ్యాం పూజలను పర్యవేక్షించారు.

**రావిపాడులో ఘనంగా రథసప్తమి పూజలు**

**పెంటపాడు:** రథసప్తమి సందర్భంగా బైరాగిమఠంలో నవగ్రహ మండపంలో సూర్యనమస్కారాలు చేసారు. రావిపాడు వ్యవసాయ పరపతి సహకార సొసైటీ సమీపంలో సూర్యదేవాలయం వద్ద ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ, పడాల నరసయ్య, వంగూరి శివ, కైగాల గణ, ఎంపీటీసీ సభ్యులు బొచ్చెల తాతారావు, కాజులూరి దుర్గామల్లేశ్ తదితరులు స్వామివారికి పూజలు చేశారు.

**భక్తి శ్రద్ధలతో చిత్రగుప్తుని నోము**

**అత్తిలి:** నోములు నోచుకునేవారు రథ సప్తమి రోజున ప్రారంభించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. శనివారం రథసప్తమి సందర్భంగా మండలంలో పాలూరు, లక్ష్మీనారాయణపురంలో పలువురు చిత్రగుప్తుని నోములు నోచుకున్నారు. ఈ నోముతో స్వర్గప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం.


అత్తిలి సూర్యదేవాలయంలో కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

### జంక్ ఫుడ్ జోలికి పోవద్దు

**తాడేపల్లిగూడెం రూరల్:** జంక్ ఫుడ్ జోలికి విద్యార్థులు పోవద్దని, అవి ఆరోగ్యానికి హాని చేస్తాయని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహరి అన్నారు. శనివారం పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ బి.రాజారావు, సీహెచ్‌వో పరిమళ, హెల్త్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

### ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్షలు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** జేఈఈ మెయిన్స్ మొదటి దశ పరీక్ష మూడో రోజు శనివారం తాడేపల్లిగూడెం వాసవీ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో బీఆర్క్ విభాగ పరీక్షకు 220 మందికిగాను 170 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్ రావు, పరీక్షా కేంద్రం సమన్వయ కర్త నటరాజ్ పర్యవేక్షించారు.

### గృహ నిర్మాణాలను పరిశీలించాలి

**తణుకు టౌన్:** జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను ప్రతి అధికారి వారానికి మూడు రోజులు పరిశీలించాలని మండల గృహ నిర్మాణ ప్రత్యేక అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పీ శ్రీనివాసరావు చెప్పారు. శనివారం తణుకు రూరల్ మండలం మండపాక, తేతలి కొండాయపాలెంలోని లేఅవుట్లను ఆయన పరిశీలించారు. తణుకు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో టీఎస్ మూర్తి, హౌసింగ్ ఏఈ వీ వెంకటరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


### వైఎస్సార్ బీమా అందజేత

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** సీతారాంపేటలో జి.నాయుడు మృతి చెందడంతో ఆయన భార్య సత్యవతికి శనివారం వైఎస్సార్ బీమాలో భాగంగా ఆయన రూ. 10 వేలు ప్రభుత్వం తరుపున అందజేశారు. వార్డు ఇన్‌చార్జి రాజా త్రినాథ్ పాల్గొన్నారు.

### పశువులకు వైద్య సేవలు

**పెంటపాడు:** పశువుల ఆరోగ్యంపై యజమానులు శ్రద్ధ తీసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ పి. మహేష్ కోరారు. కలెక్టర్ పి. ప్రశాంతి, ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు ఆయన గూడెం నియోజవర్గ పరిధిలో రోడ్లపై సంచరిస్తూ అనారోగ్యానికి గురైన పశువులకు సిబ్బందితో కలిసి వైద్యం చేసారు. పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ విజయ భాస్కర్ నేతృత్వంలో వైద్యులు జి. ప్రసాద్, మణికంఠ తదితరులు మరో రెండు రోజులు ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తారని తెలిపారు.

### పుట్టగొడుగుల సాగు లాభదాయకం


ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఉపకులపతి

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** వెంకటరామన్నగూడెం ఉద్యాన కళాశాల, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా శనివారం ఉద్యాన వర్శిటీలో పుట్టగొడుగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపకులపతి డాక్టర్ టి.జానకిరామ్ మాట్లాడుతూ పుట్టగొడుగుల సాగు లాభదాయకమని అన్నారు. బీఎస్సీ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు పుట్టగొడు గులతో 28 రకాల వంటకాలు తయారీ పోటీ నిర్వహించి ప్రతిభా వంతులకు బహుమతులు అందజేశారు. శాస్త్రవేత్తలు పి.రమాదేవి, ఎస్.నరసింహారావు, చిరంజీవి పాల్గొన్నారు.